స్కెచ్

# ఉత్తరాల సంభాషణ

"అర్జున్"

మూడుకాళ్ళ ముదుసలి రామయ్య్య ముసలివాడైనా-అతని జ్ఞాపకశక్తి-గ్రాహకశక్తి అమోఘం. అమిత శాంతపరుడని పేరైనా-అతి తొందర మనిషి. అతనిలో ఎంచదగ్గ సుగుణాలలో అతి ముఖ్యం అతని గ్రాహకశక్తి. గ్రహణశక్తి. పాము చెవులికిమల్లే (పాముకు చెవులు లేవులెండి) వుంటాయనుకొంటాను అతని చెవులు. చీమ చిటుక్కుమన్నా స్పష్టంగా శబ్దాన్ని వినగలడు. ముఖ్యమైన విషయం అంటూ చెప్పను మరిచాను. అతనికివున్న అలవాట్లలో ఉత్తరాల సంభాషణ వినడం అతనికి అభ్యాసం; విని ఆనందించడం అతనికి సంతృప్తి-అతని హాబీకూడా.

ఒకనాటి సూర్యాస్తమయాన చిన్నకవరు చేతబట్టుకొని బయలుదేరాడు ముసలి రామయ్యతాత. వీధి మొగలోవున్న పోస్టు డబ్బాలో ఉత్తరంవేసి, తదనంతరం జరగబోయే సంభాషణకై చెవినొగ్గి వినసాగాడు. ఉత్తరం గుభేల్ మని పడ్డచప్పుడుతో పాటు "అదుగో మరొకటి" అన్న ఒక స్వరం వినిపించింది.

"ఎవరు నీవు?" అనే ప్రశ్న దానితోపాటు వెలువడ్డది.

"నన్నా అడిగేది! నేనే! నన్ను నేనుగా చెప్పుకోవడం ఆత్మవిరుద్ధం అయినా చెప్పుతున్నాను. నామటుకు నేను ఆహ్వానాన్ని స్వీకరించి ఆమోదాన్ని గొనిపోతూన్న వార్తాహరుడిని" అంది నూతనంగా చేరిన ఉత్తరం.

"ఏమిటా ఆహ్వానం, ఎందులకా ఆమోదం?" అనే పంచతంత్రం కథల్లోని ప్రశ్న వేయబడ్డది.

"మనఃపూర్వకంగా కుమారుని-వివాహ సందర్భంలో విందు ఆహ్వానాన్ని. మా యజమాని ఆనందంతో ఆ విందుకు వెళ్ళదలచాడు!" అంది నూతన లేఖ. తనకీ ఆ అదృష్టం గలిగిందనే ధీమా ఆ మాటల్లో ప్రతిధ్వనించింది అందరికీ.

"ఉఫ్" అంది ఒక లేఖ గొంతు.

"చఫ్" అంది మరొక లేఖ స్వరం.

"ఏం అలా చీదేస్తారు! జమీందారింటి విందు ఆహ్వానాన్ని తెలుసా?"

"ఓయబ్బడాలా! నీమటుకేనా ఆ గొప్ప! నే నేవరనుకొంటున్నావు. మన రాజకుమార్తె వుంది తెలుసా! ఆవిడ సాన్నిధ్యంలో జరగబోయే నృత్యానికి ఆహ్వానాన్ని" అంది ఒక గొంతు.

నూతనంగాచేరిన ఉత్తరం మరి నోరువిప్పలేదు!

అప్పటికి మత్తుగా పడివున్న మిగిలిన ఉత్తరాలలో సంచలనం కలిగింది. నిద్రమత్తులోనుండి మేల్కాంచి తమ ప్రతాపాలు వెల్లడించాయి.

"నేను ఒక పెద్ద కేసులో-ముఖ్యమైన కాగితాన్ని మోసుకొని వెడుతున్నాను" అంది ఒకటి పెద్దభారం మోస్తున్నట్లు.

"ఏదో! కొద్దో గొప్పో! అప్పియ్యవయ్యా! మహానుభావా! అని ప్రార్థిస్తూ యాచనకు బయలుదేరాను నేను" అంది రెండవ లేఖ. దాని కంఠంలో నిస్పృహ విలయతాండవ మాడుతూ వినిపిస్తుంది.

"ఇవ్వవలసిన బాకీని-చిల్లిగవ్వతో సహా ఇస్తావా? చస్తావా?" అని ఖచ్చితంగా రాబట్టుకోడానికి వెడుతున్నాను" అంది ఒక కర్కశ గొంతు. దాని గొంతే అంత కర్కశంగా వుంటే సాంతంగా ఉత్తరం చదివితే ఏలా వుంటుంది ఊహించవచ్చు.

"నా మటుకూ నేనొక చిన్న కాగితాన్ని-బ్యాంకు చెక్కును" అంది నాల్గవది.

"నేనా! వేడినెత్తురు పారుతున్న నవీనభావాలు కల యువకుని తిరస్కారాన్ని అందులో తల్లి తండ్రులు ఏర్పరచిన వివాహాన్ని తృణీకరిస్తూన్న సందేశాన్ని మోసుకొని వెడుతున్నాను" అంది లేఖ. అయ్యో ఎంత కర్మరా బాబూ! అనే అభిప్రాయం కనపరిచింది.

"ఈ మార్రైనా ఇంక్రిమెంటు ఇచ్చి నా కొంప నిలపండి!" అని మనవిచేసుకొంటున్న ఒక దౌర్భాగ్యుని ఉత్తరం.

"మీరూ - మీరూ వాదాలు ప్రతి వాదాలు అడుకోవడమే తప్ప నన్ను గమనించారా?" అంది మూలనున్న ఉత్తరం గవర్నర్ జనరల్ లా.

అన్నీ ఆ వైపు చెవులు నిక్కరించి చూచి విన సాగాయి.

"మీ అందరికీ ఓ చిన్న పరీక్ష. నేనెవరినో మీరు కనుక్కోండి చూద్దాం!" అంది ఆ ఉత్తరం పెద్ద పోటీపరీక్ష పెట్టినట్లు.

"అలాగే! నిన్ను గురించి చెపుతాం. ఏదీ సూచన ప్రాయంగా కొంచెం తెలుపుకో!" అన్నాయి ఉత్తరాల సమాఖ్య ఏకకంఠంతో.

"అయితే వినండి! నేను కొంచెం ఇంచుమించు పూర్తి టావుకాగితాన్ని!" అంది ఆ ఉత్తరం.

మిగిలినవన్నీ సందిగ్ధావస్థలో పడిపోయాయి.

"ఏ ఇన్‌కమ్‌టాక్సు డిమాండు వేమో" అని అనుమానం వెల్లడించారు ఒకరు.

"ఏదో కుటుంబకేసులో రిట్ పిటీషన్ గామాలు కర్మం" అంది మరొకటి.

ఎవ్వరూ కనుగొనలేకపోయారు.

"నేను ముందే ఊహించానులే! ఏలాగూ మీరు కనుక్కోలేరని. నేను ఒక వారపత్రికకు పంపబడుతున్న భావగీతాన్ని" అంది భావగీతం.

"అయితే మరి చిక్కులేదు. నీవు క్షేమమేనా!" అన్నాయి అన్నీ.

"ఏంసుఖంగా వున్నానులే, అసలే భయపడి చస్తున్నాను" అంది భావగీతం. "ఇప్పటికి ఏడు మార్లు వెళ్ళి తిరిగి వచ్చాను. ఎక్కడి వారపత్రికాధిపతుల ఆఫీసులేదు. మరొకమారు ప్రయత్నిద్దాం" అని బయలుదేరాను అంది భావగీతం.

"శరదృతువుపైనా గేయం?"

"మరొకమాటు ప్రయత్నించండి నేనేతరగతికి చెందిన గేయాన్నో?" అంది గేయం.

"దానికేముందిలే ఏడుమార్లు వెనక్కి తిరిగి వచ్చి వున్నానన్నావుగా! ఇక ప్రశ్నేలేదు, ప్రేమకలాపాల" గేయానివి" అంది ఒక లేఖ.

"హా! హా! హా! చిక్కు విడిపోయింది. భలే బాగా చెప్పావు" అంది ప్రేమగీతిక గొంతు.

"సరేలే! నిన్ను నీవు పొగుడుకొంటు నేనూ ప్రేమలేఖనే" అంది - చిక్కుప్రశ్న విడదీసిన ప్రేమలేఖ.

"బాగుంది వరస!"

"వుండకేంలే! నీ ప్రేమలేఖ ఏలా ప్రారంభించావో! సరళి ఏలావుంది?" 'ఓ ప్రియతమా" అని ప్రారంభించాను!" అంది రెండవ ఉత్తరం.

"ఆ! అది మామూలేగా. అంతకన్నా బాగా వుంది నా సరళి. ప్రారంభంలోనే 'నా హృదయ సీమలోని నా హృదయరాణీ!!" అని ప్రారంభించాను" అన్నది మొదటి లేఖ.

"అబ్బె అదీగూడా బాగాలేదు! అంత ఆకర్షణీయంగా లేదుగూడా!" అంది మరొక ప్రేమలేఖ.

"నామటుకు నేను 'ఓ! అందాల నారాణీ' అని ప్రారంభించాను"

"అయితే నీవు పురుషునివద్ద నుంచిగా?"

"అవును! మనమందరం అంతేగా!"

"అందరనకు! నేను తప్ప. నేను వనితారత్నం నుంచి! నేను నీతో అన్నివిషయాలలో ఏకీభవిస్తాలే! సరేగాని ఉత్తరం సమాప్తి?"

"ఆ ఏముంది!' చంద్రబింబంలాంటి నీ ముద్దు మోముపై ఎన్నలేని ముద్దులతో అని ముగించాను" అంది ఒక ప్రేమలేఖ.

"అబ్బో! విరహతాపాన్ని పొందుతున్నాడల్లే వుందే! నేనుమటుకు 'సర్వదా నీ దానను' అని ముగించా!" అంది వనితా ప్రేమలేఖ.

"అంత ఎబ్బెట్టుగాలేదులే!" అని మొదటిలేఖ తన్నుగా తాను ఓదార్చుకొంది.

"నేనే చేశాను తెలుసా! రేపటిదినం స్వర్గతుల్యంగా భావించి తిరిగి కలుసుకుందాం" అని అంతంచేశాను అంది మరొకలేఖ, పిలవని పేరంటంగా.

"ఇక చాలించండి! వెధవప్రేమ పిచ్చి కలాప కార్యక్రమాలు. నావలె దేశసేవకు పాటుపడండి" అంది ఒక ఉత్తర స్వరం. అచ్చం సభా వేదికపై రాజకీయ ఉపన్యాసం దంచుతున్న నాయకుని లాగా!

"కొంచెం వివరించండి" అన్నాయి మిగిలినవి.

"నేను ఒక ప్రముఖ విమర్శనాకర్తను. రాజకీయ నాయకుడిని. ప్రభుత్వంచేసే అవకతవకల్ని

విమర్శిస్తూన్న వ్యాసాన్ని. నావల్ల ప్రజల్లో చైతన్యంకలిగి ప్రభుత్వాన్ని సరిగా ప్రవర్తించేలా చేయాలి. అందుకనే 'ప్రజాభిమాని' అని సంతకం చేశాను" అంది ఉత్తరస్వరం!

"చాలా బాగుంది. తమాషాగా వుంది. నీకూ, నాకూ, రూపాల్లో, రచన తరగతుల్లో ఒకటే కాని ఒక్కటే భేదం. నేను ప్రభుత్వ కార్యాలను హర్షిస్తున్న వ్యాసాన్ని. నీవు ద్వేషిస్తున్నావు-నేను హర్షిస్తున్నాను" అంది మరొకలేఖ.

అప్పటికి రాజకీయ ప్రసంగాలను వింటున్న శ్రోతకు అంతరాయం కలిగింది. ముసలిరామయ్య మొహంపై లాంతరు వెలుగు ప్రసరించింది.

"ఈరన్నా! ఈరన్నా! ఈడ మన రామయ్య తాత ఏడుండోయి! ఓస్టేరా! ఇంటికి మోసు వెడదాం! ఈడ ఏంకటాలనుంచి పడుండాడెమో! పాపం! ఊ-చెయ్యి ఓసేవ్!" అనే నైట్ డ్యూటి పోలీస్ జవాన్లు - వెంకడు - సుబ్బయ్య మాటలు వినిపించాయి శ్రోతకి.

---

# మరమ్మతు కావలసిన కళాశాలలు

మాచిరాజు సుబ్బారావు

ఆంధ్రదేశంలో సుమారు 30 కళాశాలలు ఉన్నవి. ఇవన్నియు టీచింగు కాలేజీలే. వీటిలో సుమారు 35 వేలమంది విద్యార్థులు చదువు కొంటున్నారు. ఇవిగాక మూడు యింజనీరింగు కాలేజీలు, రెండు మెడికల్ కాలేజీలు, ఒక వ్యవసాయ కళాశాల, ఒక వెటర్నరి కళాశాల, మొదలైన వృత్తి విద్యాలయాలు కూడా ఉన్నవి. వృత్తి విద్యాలయాలు గణనకి తీసుకొకపోతే (నిజానికవి ప్రభుత్వపరంగా ఉన్నాయి) మిగిలిన కళాశాలలన్నీ దాదాపు ప్రైవేటు సంస్థలక్రింద, మిషనరీల క్రింద ఉన్నవి. విద్యార్థి రుసుం క్రింద దాదాపు ప్రతి సంవత్సరం 65 లక్షల రూపాయలు చెల్లింపబడుతూంది. రాష్ట్రంలోని కళాశాలలలో వివిధ తరగతులకు చెందిన అధ్యాపకులు సుమారు రెండువేలమంది కలరు. వీరందరికి సగటున నెఃకు 175 రూపాయలు చొప్పున సంవత్సరానికి మొత్తం 42 లక్షల రూపాయలు ముట్టజెప్పుతున్నారు. ఇవిగాక యితర ఖర్చులు సుమారు పదిలక్షలగును. అంటే దాదాపు 13 లక్షలు మిగులు కనిపిస్తూంది. కనీసం ఏడు, ఎనిమిది లక్షలయినా మిగులు ఉండకపోదు. ఈ కళాశాల లన్నియు వ్యక్తుల యాజమాన్యమున నుండుటచే ధననష్టమే గాక విద్యార్థులకు, అధ్యాపకులకు అనేక యిబ్బందులు కలుగుతున్నవి. లాభాన్ని నష్టంగా చూపించడం ఏమంత కష్టమైన పనిగాదు.

విద్యార్థులకు కళాశాలలన్నిటిలోను ఒకే విధమయిన జీతములు లేవు. ఉదాహరణకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ట్యూషనుఫీజు క్రింద టెర్మ్‌కు 40 రూపాయలు, కొందరు 45 రూపాయ‌ః, మరికొందరు 50 రూపాయలు సహితం వసూలు చేస్తున్నారు. ఇవిగాక స్పెషల్ ఫీజులు వివిధరకాలు. కళాశాల ఆర్థికస్థితినిబట్టి వీటిలో మార్పులకు యూనివర్శిటీ రూల్సులు నుండుటచే యిలా జరుగుచున్నది. స్పెషల్ ఫీజులు ఒక తంతుమాత్రమే. రాష్ట్రంలోని ఏ ఒక్క కళాశాలలోనూ ఆటలకు సరైన సదుపాయాలు లేవు. (కావలసినంత స్థలం మాత్రం ఉంటుంది) అయినా గేమ్సు ఫీజుక్రింద టెర్మ్‌కు 2 రూ, లేక 3 రూ చెల్లించవలసిందే. సంవత్సరానికి ఒక్కసారి యిచ్చే మేగజైను 60 పేజీలకు మించదు. కాని దీనిక్రింద 4 రూపాయలు వసూలు చేస్తారు. న్యాయంగా యిది ఒక రూపాయి లోపు మాత్రమే అవుతుంది. ఈ ఫీజులుకూడా మేనేజిమెంట్ల ఇష్టమే. కొన్ని కాలేజీలలో యూనియను ఫీజులు కూడా నిర్బంధంగా వసూలు చేస్తున్నారు. మేనేజిమెంట్ల దురాగతాలకు అధ్యాపకులు